ముదురుతున్న వరినారు

- నెల రోజులుగా ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- మండలంలో ఇప్పటివరకు 57.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు


రైతు పొలంలో ముదురుతున్న వరి నారు

రామడుగు: నెల రోజులు గడుస్తున్నా అన్నదాతలు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో వరినారు పోసుకున్నప్పటికీ నాటు వేసుకోలేని పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భూగర్భజలాలు పెరగని పరిస్థితి నెలకొనడంతో పొలాలు దున్నుకోలేకపోతున్నామని వాపోతున్నారు. వారం రోజుల్లో ఆశించిన వర్షాలు కురిసినట్లేనే రైతులు ముందస్తుగా పోసుకున్న వరినారు నాటు వేసుకునే అవకాశం ఉంటుంది. లేదంటే పోసుకున్న వరి నారు వృథా అయ్యే పరిస్థితి ఉందని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణరెడ్డి తెలిపారు.

సగటు వర్షపాతం 57.6 మిల్లీ మీటర్లు

మండలంలోని 23 గ్రామాలలో ఇప్పటి వరకు సగటు వర్షపాతం కేవలం 57.6 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదు అయింది. కనీసం దుక్కులు తడిసే వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. వర్షాలు కురవకపోవడంతో మండలంలో భూగర్భజలాలు పెరగక వ్యవసాయ బావులలో నీటి మట్టం పెరగలేదు. దీంతో రైతుల సాగు పనులు ముందుకుసాగడం లేదు. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు జూన్‌లో పోసుకున్న వరినారు ముదురుతుందని ఆందోళన చెందుతున్నారు.

గతేడాది...

గతేడాది రైతులు వానాకాలంలో 15,782 ఎకరాల్లో వరి, 6,465 ఎకరాల్లో పత్తి, 327 ఎకరాల్లో మొక్కజొన్న, 77 ఎకరాల్లో కంది సాగు చేశారు. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు రైతులు వర్షాలు కురువకపోవడంతో కేవలం మూడు వేల ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకు వరి సాగుపనులు మొదలుపెట్టారని అధికారులు తెలిపారు.

పదిగుంటలు పారుతలేదు



వర్షాలు పడుతాయని వరినారు పోసుకున్నా. బావిలో నీళ్లు లేక పదిగుంటల మడి పారలేదు. ఏం చెయ్యాలో తెలియడంలేదు. వర్షాలు పడితేనే పొలం దున్నుకునే అవకాశం ఉంటుంది. లేకపోతే పోసిన వరినారు ముదిరిపోయే ఉంది.

–ద్యావ భూంరెడ్డి, రైతు, వెదిర

నీళ్లు సరిపోతలేవు



వర్షాలు కురవకపోవడంతో పొలం దున్నుకోవడానికి నీళ్లు సరిపోతలేవు. దీంతో ఇబ్బందులు పడుతూ పొలం దున్నుకుంటున్నాం. కానీ నారు ముదిరిపోయే పరిస్థితి ఉంది. కేవలం పత్తి పంటకు అనుకూలమైన వర్షాలు పడుతున్నాయి.

– కోతి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, గణేశ్‌నగర్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ మద్దతు తెలిపారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి కార్మికులు ప్రజలకు సేవలందించారని కొనియాడారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా రూ. పదిలక్షలు చెల్లించి, ఎనిమిది గంటల పని కల్పించాలన్నారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు మాట్లాడుతూ.. కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా మత్స్యసహకార శాఖ చైర్మన్ మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామారావు, నాయకుల, పాల్గొన్నారు.

జమ్మికుంట: కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పంచాయతీ కార్మికుల సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తుందని, పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాయలం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు.

హుజూరాబాద్: కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల దీక్ష మద్దతు తెలిపి మాట్లాడారు. బీసీ నాయకులు సందేల వెంకన్న, కార్మికుల అధ్యక్షుడు రాములు, పాల్గొన్నారు.

శంకరపట్నం: ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కేశవపట్నంలోని అంబేడ్కర్ విగ్రహానికి గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందించారు. ఉద్యోగభద్రత, వేతనాల పెంపు, బీమా తదితర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. చాలీచాలనీ వేతనాలు సరిపోవడంలేదని, పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తిరుపతిరావు, మల్లేశం, సదానందం,సంపత్, తదితరులున్నారు.



శంకరపట్నం: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

క్లుప్తంగా

పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

గంగాధర: మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో మంగళవారం ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురుగుకాలువలు, వీధులు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సామూహిక ఇంకుడుగుంతలు నిర్మించాలని సూచించారు.

ఎస్సైని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు


ఎస్సైని సన్మానిస్తున్న యూత్ నాయకులు

గన్నేరువరం: గన్నేరువరం ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నర్సింహారావును మంగళవారం యూత్ కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంప మహేష్, గ్రామశాఖ అధ్యక్షుడు బొజ్జ తిరుపతి, ముత్తయ్య, సాయికృష్ణ, కొమురయ్య, అజయ్, మహిపాల్, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

కేశవపట్నం ఇన్‌చార్జి ఎస్సైగా సురేందర్



శంకరపట్నం: కేశవపట్నం పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సైగా వీఆర్‌లో ఉన్న సురేందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 6న కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్‌ను ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌కు సీపీ సుబ్బారాయుడు బదిలీ చేయడంతో మంగళవారం రిలీవ్ అయ్యారు. గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న సురేందర్‌ను వీఆర్‌లో ఉంచారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైను నియమించకపోవడంతో ఇన్‌చార్జి ఎస్సైగా వీఆర్‌లో ఉన్న మామిడాల సురేందర్ బాధ్యతలు చేపట్టారు.

వేగంగా నాయీబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణాలు


పనులు ప్రారంభిస్తున్న రమేశ్, నాయకులు

తిమ్మాపూర్: అఖిలభారత నాయీ బ్రాహ్మణ సేవా సంఘం భవన నిర్మాణ పనులు ఉమ్మడి నుస్తులాపూర్, ఇందిరానగర్, రామకృష్ణకాలనీలో వేగంగా జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా మంగళవారం స్లాబ్ వేశారు. సంఘం భవన నిర్మాణ దాత నుస్తులపూర్ సర్పంచ్ రావుల రమేష్ స్లాబ్ పనులు ప్రారంభించారు. ఉపసర్పంచ్ బేతి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తమ్మనవేణి కనకయ్య పాల్గొన్నారు. భవన నిర్మాణానికి కృషి చేస్తున్న సర్పంచ్ రమేష్‌కు నాయీ బ్రాహ్మణుల సంఘం తరపున అధ్యక్షుడు సముద్రాల రాజు కృతజ్ఞతలు తెలిపారు.

14న నిరసన

రామడుగు: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట 14న నిర్వహించే మాల మహానాడు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా కన్వీనర్ కాడె శంకర్ ప్రకటనలో కోరారు. దళిత బంధు మాల, ఉపకులాలకు కేటాయించకుండా తీరని అన్యాయం చేస్తున్నారని దీన్ని నిరసిస్తూ చేపట్టే కార్యక్రమంలో మాల, ఉపకులస్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ ఏఎన్‌ఎంగా ధనలక్ష్మి


అవార్డు అందిస్తున్న జిల్లా అధికారులు

చిగురుమామిడి: చిగురుమామిడి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముదిమానిక్యం ఉపకేంద్రంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న ధనలక్ష్మి ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఏఎన్‌ఎం అవార్డు అందుకున్నారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారని చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ గర్భిణుల నమోదు, నెలవారి టీకాలు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు, సేవలు, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు, సుఖ ప్రసవాలు వంటి వైద్య సేవల్లో ముందుంటారని వివరించారు.

జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ


ఇల్లందుకుంట: వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ


జమ్మికుంటలో..


రామడుగులో...

జమ్మికుంట: పట్టణంలోని వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి సనా జవేరియా ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరిగితే పలు సమస్యలు వస్తున్నాయని, దేశ ప్రగతి, అభ్యున్నతి జనాభాపై ఆధారపడి ఉంటుందన్నారు. కుటుంబ నియంత్రణ, మహిళ సాధికారత, విద్యను ప్రోత్సహించడం వంటి సేవలకు ప్రాముఖ్యత అందించడంపై అవగాహన, ప్రతిజ్ఞ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్, సూపర్‌వైజర్స్ రత్నకుమారి, అరుణ, అనిల్‌కుమార్, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి హైస్కూల్‌లో గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ కాసార్ల ఆనంద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్ర ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్‌రెడ్డి, రాంపల్లి శ్రీనివాస్, కొడిమ్యాల వెంకటరమణ, హెచ్‌ఎం వెంకటనారాయణ, డైరెక్టర్ మునీందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వి.తులసీదాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లందకుంట వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధిక జనాభా అనర్థాలకు దారి తీస్తుందని, జనాభా పెరుగుదల వల్ల ఆహార కొరత, నిరక్షరాస్యత పెరుగుతుందని, మానవ వనరులు తగ్గిపోతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సీహెచ్‌వో శ్యామల, సంజీవ్‌కుమార్, రాజు, మానస, రమేష్, సత్యమ్మ, రోజారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో చెల్పూర్ విద్యార్థి ప్రతిభ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి జె. రవితేజ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జిల్లా కేంద్రంలో డీఈవో జనార్దన్‌రావు, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాడని హెచ్‌ఎం అంజయ్య తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమేశ్

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ రావుల రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫాం, అల్పాహారం కింద రాగిజావ, నోట్‌బుక్స్ అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి లక్ష్యం వైపు వెళ్లాలని కోరారు. హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాఠశాలకు పుస్తకాలను అందించాలని సర్పంచ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డిని కోరారు. కార్యక్రమంలోటీచర్లు ఉమారాణి, రాజ్యలక్ష్మీ, మధుసూదన్‌రెడ్డి, విజయలక్ష్మి, రమణి, మైథిలీ, వివేకానంద, అరుణదేవి, సురేఖ, మంజుల పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఎంపీ బండి సంజయ్ జన్మదినం సందర్భంగా కార్యక్రమం నిర్వహించామన్నారు. హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, అంజయ్య, కోలపురి కార్తీక్, బద్దెనపల్లి రాజేందర్, కోట శ్రీనివాస్, కంకణాల సంతోశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ బహూకరణ



శంకరపట్నం: మండలంలోని తాడికల్ అంగన్‌వాడీ కేంద్రానికి ఎంపీటీసీ బుద్దార్థి వరలక్ష్మి సీలింగ్ ఫ్యాన్ బహూకరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్‌లో భాగంగా గ్రోత్ మానిటరింగ్ డే నిర్వహించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందిసున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సబిత, సూపర్‌వైజర్ స్రవంతి ఉన్నారు.

ఎంఈవోకు ఉపాధ్యాయుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న డీటీఎఫ్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో ఎంఆర్‌సీ కార్యలయంలో ఎంఈవో విడుపు శ్రీనివాస్‌కు డీటీఎఫ్ ఆధ్వరంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించాలని, మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలను అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రతినెల బిల్లులు చెల్లించాలన్నారు. 2021–22 విద్యా సంవత్సరం వేసవి ఈఎల్ఎస్ ప్రొసీడింగ్ తీయాలని, మండలంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రతినెల సమావేశం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు నరహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

సైదాపూర్: కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఘన్‌పూర్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అందాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమం విస్మరించిందని, పల్లెల అభివృద్ధిని పట్టించుకోవడంలేదన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసిందని, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు


సుందరగిరి ప్రభుత్వ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిగురుమామిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు కానుగంటి రాజమౌళి మంగళవారం ప్రారంభించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సభ్యత్వం అందించడంతో పాటు అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని సుందరగిరిలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుర్రం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తిరుపతిగౌడ్, నాయకులు కె. శ్రీనివాస్, ఎ. రవీందర్‌రెడ్డి, రాజేశం, కరుణాకర్, మునిప్రసాద్, షరీఫ్, సత్తయ్య, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి’


హుజూరాబాద్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిమ్మాపూర్: వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఖండించారు. రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రైతులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. బషీర్‌బాగ్‌లో రైతులను కాల్చి చంపిన చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంట్, సాగునీరు, రైతుబంధు, రైతుబీమా ఇస్తూ రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నారని, రైతులంతా సంతోషంగా ఉంటే తట్టుకోలేని రేవంత్‌రెడ్డి ఉచిత కరెంటు ఇవ్వొద్దని, మూడు గంటలు ఇస్తే చాలంటూ మాట్లాడం ఆక్షేపనీయమన్నారు. చంద్రబాబు మరో రూపమే రేవంత్ అని మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో గ్రామాల్లో రెండు రోజులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం, పిండప్రదానం వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సమావేశాలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శేషు పాల్గొన్నారు.

రామడుగు: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి వెదిర గ్రామం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడారు...రైతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సంక్షిప్త వార్తలు

సతీశ్ నిమ్మలకు పురస్కారం

జమ్మికుంట: పట్టణానికి చెందిన అమ్మ ప్రొడక్షన్స్ అధినేత సతీశ్ నిమ్మల హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా సినీ ప్రముఖుల చేతుల మీదుగా సోమవారం రాత్రి నంది పురస్కారం అందుకున్నారు. జమ్మికుంటలో అమ్మ ప్రొడక్షన్స్ స్థాపించి, వర్ధమాన కళాకారులు, నటీనటులు, టెక్నీషియన్లకు అవకాశాలిస్తున్న సతీష్ మరిన్ని మంచి చిత్రాలు రూపొందించాలన్నారు. అనంతరం ఫౌండేషన్‌కు సతీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ సినీ నటులు రాజేంద్రకుమార్, అదిరే అభి, సంపత్‌రెడ్డి, డబ్బింగ్ ఆర్టిస్ట్ సీఎం రాజు, మా అసోసియేషన్ ఈసీ మెంబర్ ఎంఆర్ చౌదరి, రాజేంద్రరాజు, శ్రీలక్ష్మి, సురేఖ ఉన్నారు.

విరాళం అందజేత

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామంలో శిథిలావస్థలకు చేరిన అషుర్ఖానా(పీరీల షెడ్డు) మరమ్మతులకు కాంగ్రెస్ నాయకుడు పుల్లూరి సదానందం మంగళవారం రూ.25 వేలు విరాళం ఇచ్చారు.

ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో మంగళవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి టపాసులు పేల్చారు, స్వీట్లు పంపిణీ, పీహెచ్‌సీల్లో రోగులకు పండ్లు అందజేశారు. ఆలయాల్లో పూజలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్

బీజేపీలో చేరిక



గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గుండారం శశిధర్‌కుమార్ బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలో చేరారు. నియోజకవర్గ కన్వీనర్ శ్రావణ్‌కుమార్ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.